క్లుప్తంగా

వైభవంగా రథయాత్ర



ఇస్కాన్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలో రథయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: లెర్న్ గీత, లివ్ గీత (ఇస్కార్ వారి భగవద్గీత పాఠశాల) ఆధ్వర్యంలో ఆదివారం జంగారెడ్డిగూడెం పట్టణంలో శ్రీ రాధా శ్యామసుందర, శ్రీ వెన్నముద్ద గోపాలస్వామి వార్ల మూర్తులతో రథయాత్ర నిర్వహించారు. స్థానిక గంగానమ్మ అమ్మవారి ఆలయం నుంచి వాసవీమాత ఆలయం వరకు ఈ యాత్ర సత్య గోపీనాథ్ ప్రభూజీ పర్యవేక్షణలో జరిగింది. అలాగే స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. దీనిలో భాగంగా రాధాశ్యామసుందర స్వామికి మహాభిషేకం, నక్షత్ర హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహాప్రసాద వితరణ చేశారు. ప్రత్యేక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు భగవద్గీత, మహా ప్రసాదము, ఫొటో, శేషవస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో వెలగా కళ్యాణి ప్రసాద్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు సిద్ధమవుతున్న గణనాథులు



కొయ్యలగూడెంలో చవితి వేడుకలకు సిద్ధమవుతున్న గణనాథుల విగ్రహాలు

కొయ్యలగూడెం: చవితి వేడుకలకు వినాయక విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. వచ్చే నెల 7వ తేదీన వినాయక చవితి పర్వదినం సందర్భంగా గణనాథుల విగ్రహాలను తెలంగాణ రాష్ట్రం నుంచి తీసుకొచ్చి కొయ్యలగూడెం, పరిసర ప్రాంతాల్లో పలు కూడళ్ల వద్ద ఏర్పాటు చేసి వ్యాపారస్తులు విక్రయాలు ప్రారంభించారు. అడుగు ఎత్తు విగ్రహం నుంచి పదిహేను అడుగుల ఎత్తు గల విగ్రహాల వరకు తీసుకొచ్చినట్లు వ్యాపారి ఇటికెల తాతారావు తెలిపాడు. గణనాథుల ఆకృతులను బట్టి ధర ఉందని ప్రస్తుతానికి కొనుగోలు చేసిన విగ్రహాలకు అడ్వాన్స్‌లు ఇచ్చి నిర్వాహకులు బుకింగ్ చేస్తున్నారన్నారు.

బకాయిలు ఇప్పించాలని కళాకారుల వేడుకోలు



ప్రభుత్వాన్ని వేడుకుంటున్న కళాకారులు

టి.నరసాపురం: కళారూపాల ప్రదర్శనకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు ఇప్పించాలని ఏపీ జానపద కళాకారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్‌ఆర్ కృష్ణ బాబు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు భాష సాంస్కృతిక శాఖ సమాచార శాఖ ఆధ్వర్యంలో కళాకారులు కళా ప్రదర్శనలు నిర్వహించారన్నారు. అయితే వాటికి సంబంధించిన బకాయిలు నేటికి రాలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నాలుగు నెలల్లో బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఆ మేరకు బకాయిలు చెల్లించాలని కోరారు. బొర్రంపాలెంలో వీరమల్ల సత్యనారాయణ ఇంటి వద్ద జరిగిన జానపద కళాకారుల సంఘం సమావేశంలో ఎల్‌ఆర్ కృష్ణ బాబు, షేక్ సుభాన్, ఏపీ ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా కన్వీనర్ టీవీఎస్ రాజు, ఏపీ ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా శాఖ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: దివ్యాంగులకు వివాహంతో సంబంధం లేకుండా ఇళ్లు, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్‌పీఆర్‌డీ మండల కన్వీనర్ గంధం ఝాన్సీ రాణి విజ్ఞప్తి చేశారు. చింతలపూడిలోని ఒక జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగిన మండల శాఖ సమావేశంలో మాట్లాడుతూ ఆర్‌టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు అంత్యోదయ కార్డులు అందజేయాలని కోరారు. జాతీయ వేదిక నాయకులు కుందేటి జయరాజు మాట్లాడుతూ చదువుతో సంబంధం లేకుండా దివ్యాంగులందరికీ త్రిచక్ర పెట్రోల్ వాహనాలను పంపిణీ చేయాలన్నారు. 2016 దివ్యాంగుల చట్టాలను రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌వీఎస్ నారాయణ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



సెక్యూరిటీ కౌన్సిల్ ఏర్పాటు చేయాలి



కొయ్యలగూడెం: ప్రతి వైద్య కళాశాల బోధనాస్పత్రుల్లో సెక్యూరిటీ కౌన్సిల్ ఏర్పాటు చేయాలి. ఇందులో ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ పోలీస్ ఉన్నతాధికారి, జూనియర్ డాక్టర్స్, నర్సింగ్ అసోసియేషన్‌ల నుంచి ఒక్కొక్కరు సభ్యులుగా నియమింపబడి ఉండాలి. తరచూ సమావేశాలు నిర్వహించి సెక్యూరిటీ లోపాలు ఉంటే చర్చించి చర్యలు తీసుకోవాలి. రాత్రి సమయాల్లో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలి.

–ఆనందం సుబ్బారావు, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు

నైట్ వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలి



కొయ్యలగూడెం: పలు పీహెచ్‌సీలలో నైట్ వాచ్‌మన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో రాత్రి సమయాల్లో ఒకరు మాత్రమే డ్యూటీ చేసే స్టాఫ్ నర్సులు భయాందోళనలకు గురవుతున్నారు. రోగులను చూసే నెపంతో కొందరు తరచూ మద్యం సేవించి హాస్పిటల్లోకి వచ్చి నానా హైరానా సృష్టిస్తున్నారు. అంతేకాకుండా విలువైన వస్తువులను సైతం దొంగిలించుకుపోతున్నారు. దీంతో జరిగిన నష్టాన్ని సిబ్బంది భర్తీ చేయాల్సి వస్తుంది. వెంటనే సెక్యూరిటీ పోస్టులు భర్తీ చేయాలి.

– జీ వెంకటలక్ష్మి, స్టాఫ్ నర్స్ బయ్యన్నగూడెం

లోపాలు తొలగితే.. 'నిమ్మ' అదిరేనమ్మ

- నిమ్మలో అధిక దిగుబడి, మంచి ఆదాయం సాధ్యం
- మంగు, సూక్ష్మధాతు లోపాల నివారణకు సూచనలు





ద్వారకాతిరుమల మండలం గుండుగొలనుకుంటలోని తోటలో నిమ్మ చెట్లు, నిమ్మకాయలు (అంతర చిత్రం), దేవదానం, ఉద్యానశాఖ అధికారి, ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల: నిమ్మ తోటల్లో ప్రధాన సమస్య మంగు. ఇది సోకిందంటే రైతుకు తీవ్ర నష్టమే. సూక్ష్మధాతు లోపం కూడా నిమ్మ పంటను బాగా వేధిస్తోంది. అధికారుల మాటల్లో చెప్పాలంటే దేశంలో ఎక్కడా సూక్ష్మధాతు లోపం లేకుండా నిమ్మ తోటలు లేవు. మంగు, సూక్ష్మధాతు లోపం సమస్యల నుంచి తోటను కాపాడగలిగితే ఆ రైతులు తన కష్టానికి తగిన ప్రతి ఫలాన్ని ఇంట్లో ఉంచుకున్నట్లే. నిమ్మ రైతు శ్రేయస్సు కోసం ఈ రెండు ప్రధాన సమస్యల నుంచి గట్టెక్కే విధానాలపై ద్వారకాతిరుమల మండల ఉద్యానశాఖాధికారి దేవదానం పలు సూచనలు అందజేశారు. మెట్ట ప్రాంతంలో నిమ్మ సాగు అధికంగా జరుగుతుంది. ఒక్క ద్వారకాతిరుమల మండలంలోనే 2,500 ఎకరాల్లో నిమ్మ పంట సాగవుతోంది. అధికంగా తిమ్మాపురం, రామన్నగూడెం, తిరుమలంపాలెం గ్రామాల్లో, స్వల్పంగా వెంకటకృష్ణాపురం, గుండుగొలనుకుంట, సత్తెన్నగూడెం తదితర గ్రామాల్లో రైతులు నిమ్మ సాగు చేస్తున్నారు. అయితే మంగు, సూక్ష్మధాతు లోపాల సమస్యలు నిమ్మలో ఎక్కువగా ఉన్నాయి.

మంగు అంటే..

నిమ్మలో ప్రధాన సమస్య మంగు. ఇది నల్లి పురుగు వల్ల వస్తుంది. మొక్కల్లో ఎదుగుదల లోపించడం. కాయ నాణ్యత దెబ్బ తినడం నల్ల మచ్చ ఏర్పడడం మంగు లక్షణం. నల్లి పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే 40 శాతం వరకు పంట దిగుబడి దెబ్బతినే అవకాశం ఉంటుంది. మంగు సోకిందంటే కాయలపై నల్లటి మచ్చలు ఏర్పడతాయి. మంగు సోకిన చోట ఎండ తగిలితే రసాయన చర్య జరిగి కాయ కుళ్లిపోతుంది. మార్కెట్లో వ్యాపారులు వాటిని కొనుగోలు చేయరు. ధరలు తగ్గిపోతాయి. దిగుబడులు పూర్తిగా పడిపోతాయి.

సూక్ష్మధాతు లోపం

మొక్కలను నాటాక ప్రతి రెండు నెలలకు చిగుర్లు వచ్చేటప్పుడు సూక్ష్మధాతు మిశ్రమంలో ఆగ్రోమిన్‌మాక్స్, రోగార్, క్లోరిపైరిఫాస్‌లో ఏదో ఒకదానిని కలిపి పిచికారీ చేయాలి. దీనివల్ల పురుగులు పంటను తింటాయనే భయం ఉండదు. మొక్కల పెరుగుదల కూడా బాగుంటుంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి పశువుల, రసాయన ఎరువులను పంటకు తప్పనిసరిగా వేయాలి. ప్రతి ఆరు నెలలకు ఎకరా పొలంలో 800 గ్రాముల యూరియా, 1200 గ్రాముల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 500 గ్రాముల పొటాష్, 3 కిలోల వేపపిండి లేదా ఆముదం చెక్క 50 కిలోల పశువుల ఎరువు తప్పనిసరిగా అందించాలి. ఒక్కో మొక్కకు 150 గ్రాముల పశువుల ఎరువులో ఫార్ములా 7ను కలిపి ప్రతి ఏడాది అందించాలి. దీనివల్ల సూక్ష్మధాతు లోపం కనిపించదు. సూక్ష్మధాతు లోపం కనిపిస్తే 3 గ్రాముల ఆగ్రో మిన్ మాక్స్‌ను లీటరు నీటిలో కలిపి వారంలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేసుకోవాలి.

మంగు సమస్యకు పరిష్కారం

- నల్ల మచ్చలను పూర్తిగా నిర్మూలిస్తేనే మంగు సమస్య నుంచి రైతులు బయటపడతారు.
- మంగుపై రైతుల్లో అనేక అపోహలున్నాయి.
- పురుగు మందు కొడితే మంగు పెరుగుతుందనే అభిప్రాయం తప్పు.
- మంగు నివారణకు మందులు పిచికారీ చేస్తే నల్లి చావదని, పైగా మంగు పెరిగిపోతుందని రైతుల్లో భయం ఉంది. దీని నుంచి బయటకు రావాలి.
- 2 ఎంఎల్ ఫైరోమైట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే నల్లి నుంచి పంటను కాపాడవచ్చు.

ముఖ్యమైన మెలకువలు

- సూక్ష్మధాతు లోపం నివారణకు నులి పురుగులు లేని బలమైన మొక్కలను రైతులు ఎంచుకోవాలి.
- ఎటుచూసినా ఆరు మీటర్ల దూరం ఉండేలా మొక్కలు నాటాలి.
- డ్రిప్ పద్ధతిలో సాగు చేపడితే కలుపు సమస్యను అధిగమించవచ్చు. మొక్కలు బాగా పెరుగుతాయి.
- డ్రిప్ పద్ధతి ద్వారా వేరుకుళ్లు నివారించుకోవచ్చు. పంటలో వేరుకుళ్లు కనిపిస్తే ఙ్గానోడెర్మాను పిచికారీ చేసుకోవాలి.
- బ్లాక్, బ్రౌన్ నల్పర్‌లో ఏదో ఒకటి లీటరు నీటిలో 2 గ్రాములు కలిపి పిచికారీ చేస్తే నల్లిని నివారించుకోవచ్చు. అయితే తోటలో పూత మీద ఉన్నప్పుడు సల్ఫర్ పిచికారీ చేయకూడదు. కాయ మీద ఉన్నప్పుడే పిచికారీ చేసుకోవాలి. అందుకే ఫైరోమైట్ పిచికారీ చేయడమే శ్రేయస్కరం.

విగ్రహ తొలగింపుపై వివాదం



వైఎస్సార్ విగ్రహ తొలగింపులో ధ్వంసమైన దిమ్మె

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని కృష్ణంపాలెంలో వైఎస్సార్ విగ్రహం తొలగింపుపై ఆదివారం వివాదం నెలకొంది. ఇంటికి అడ్డుగా ఈ విగ్రహం ఉందనే కారణంతో ఇద్దరు వ్యక్తులు పక్కనే నిర్మించిన దిమ్మె పైకి వైఎస్సార్ విగ్రహాన్ని మార్చేందుకు ప్రయత్నించారు. అయితే ఈ క్రమంలో దిమ్మె, శిలాఫలకం ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సమస్యపై చర్చించారు. విగ్రహాన్ని తొలగించడం సరికాదని, విగ్రహాన్ని తొలగించిన స్థానంలోనే తిరిగి దిమ్మె కట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పార్టీ శ్రేణులు కోరుతున్నారు.

మైనర్లకు వాహనాలిస్తే.. శిక్ష యజమానికే



వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై చెన్నారావు

కామవరపుకోట: తడికలపూడి ఎస్సైగా పి. చెన్నారావు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో పని చేస్తూ బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై జయబాబు టి.నరసాపురం మండలం వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై చెన్నారావు మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యక్రమాలు అరికట్టేందుకు కృషి చేస్తానని, శాంతిభద్రతల పరిరక్షణకు విఘాతం కలగకుండా చూస్తానని తెలిపారు. అనంతరం తడికలపూడి గాంధీబొమ్మ సెంటర్లో రోడ్డు నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయటం ప్రమాదకరమని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. వాహనాల ప్రమాదాల్లో ఎక్కువ శాతం మరణాలు హెల్మెట్ ధరించకపోవడం వలనే జరుగుతున్నాయన్నారు. హెల్మెట్ ధారణతో వీటిని నివారించవచ్చు అన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండని పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. అలా ఇస్తే వారికి ఏదైనా ప్రమాదం జరిగితే, శిక్ష వాహన యజమానికి పడుతుందని, రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు అవగాహన కల్పించారు.

జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరం రైస్‌మిల్లు సమీపంలో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు చేపట్టారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం అందుకున్న ఏఎస్సై భాస్కరరావు తన సిబ్బందితో కలిసి దాడులు చేపట్టారు. నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.4వేల 60 స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై చెప్పారు.

పేకాట స్థావరంపై దాడి

లింగపాలెం: మండలంలోని కలరాయనగూడెంలో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్సై వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.20,200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

3వ తేదీ వరకు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా

దెందులూరు: 132 కేవీ భీమడోలు, భీమడోలు–ఏలూరు ఫీడర్ ప్రస్తుతం కండక్టర్ మార్పు చేయడం కారణంగా ఆదివారం నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నటరాజన్ తెలిపారు. విద్యుత్ కేంద్రం పరిధిలోని రామారావుగూడెం, దెందులూరు, పూళ్ల, సూరప్పగూడెం, గుండుగొలనుకు చెందిన వ్యవసాయ శాఖకు సంబంధించి సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



జంగారెడ్డిగూడెం: ప్రతిభ పాఠశాలలో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు



కొయ్యలగూడెం: కృష్ణాష్టమి వేడుకల్లో అలరిస్తున్న చిన్నారుల వేషధారణలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ప్రతిభ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్న పిల్లందరూ బాల కృష్ణుడు, గోపికల వేషధారణలతో, సాంస్కృతిక కార్యక్రమాల్లో అలరించారు. రాధాకృష్ణులుగా చిన్నారులు ఉట్టికొట్టే కార్యక్రమం చేపట్టారు. అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు. విద్యా సంస్థల ప్రిన్స్‌పాల్ కాసర సరోజారెడ్డి,, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు పారిజాతగిరిలో కృష్ణాష్టమి వేడుకలు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం వైష్ణవ కృష్ణాష్టమి సందర్భంగా (కన్నన్ తిరునక్షత్రం) వివిధ పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు కార్య నిర్వహణాధికారి మాణికల రాంబాబు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీకృష్ణుని ఉత్సవమూర్తికి విశేష స్నపణము, సాయంత్రం 6 గంటల నుంచి భక్తుల సమక్షంలో సామూహిక శ్రీకృష్ణ అష్టోత్తర అర్చన ప్రత్యేక ప్రసాద నివేదన, ఉట్టి వేడుక, అనంతరం అభినయ కూచిపూడి నాట్యఅకాడమీ రూపదేవి శిష్య బృందంచే నృత్య ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుని దివ్య అనుగ్రహం పొందాలని ఈవో రాంబాబు కోరారు.

కృష్ణాష్టమి వేడుకలకు ముస్తాబు

కొయ్యలగూడెం: కృష్ణాష్టమి వేడుకల నిర్వహణకు వైష్ణవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను శని, ఆదివారాల్లో కొన్ని ఆలయాలు పాఠశాలల వద్ద స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు అలరించారు. కన్నాపురం రోడ్డులోని టెంపుల్స్ సెంటర్లో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో సోమవారం వేడుకల నిర్వహణకు ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు పాలకమండలి చైర్మన్ మద్దు గోపి తెలిపారు. సాయంత్రం నుంచి ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించి విజేతలకు నగదు బహుమతి అందజేస్తామన్నారు. అచ్యుతాపురం శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు అర్చకులు చరణదాసు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. పూరి జగన్నాథుని ఆలయ పూజా విధానాలను ఇక్కడ కూడా అమలు చేయడం ఈ ఆలయ విశిష్టత అని చరణ్ దాస్ తెలిపారు.

మేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలి



పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వేలేరుపాడు: మేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ నిరుద్యోగ హెల్త్ అసిస్టెంట్ సంఘం సభ్యులు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు వినతిపత్రం ఇచ్చారు. హెల్త్ అసిస్టెంట్ మేల్ సమస్యల గురించి ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గత 21 ఏళ్ల నుంచి మేల్ హెల్త్ అసిస్టెంట్ నర్సింగ్ పోస్టులు తీయలేదని చెప్పారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి మేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ హెల్త్ అసిస్టెంట్ చినబాబు, దుర్గారావు, రమేష్, నాగేంద్ర, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్కే గౌస్

వేలేరుపాడు: పెద్దవాగు, గోదావరి వరదల వల్ల సర్వస్వం కోల్పోయిన వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జంగారెడ్డిగూడెం కార్యదర్శి ఎస్కేగౌస్ విమర్శించారు. ఆదివారం ప్రజాపంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ సమావేశం అల్లూరి నగర్‌లో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలవుతున్నా ఏ ఒక్క హామీ నేటికీ అమలు చేయకపోవడం విచారకరమన్నారు. కనీసం వరద ముంపు గ్రామాల్లో తాగునీటి సమస్యను నేటికీ తీర్చలేకపోయిందన్నారు. పెద్దవాగు ప్రవాహానికి కొట్టుకుపోయిన, పూర్తిగా దెబ్బతిన్న పక్కా, భవనాలకు రూ.లక్ష, పూరిండ్లకు రూ.50 వేలు, వరదలో కొట్టుకుపోయిన గేదెలకు రూ.50 వేలు, ఎడ్లకు రూ.30 వేలు, గొర్రెలు, మేకలకు రూ.20 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని గౌస్ డిమాండ్ చేశారు. కమ్మరిగూడెం, మేడేపల్లి, అల్లూరినగర్, ఒంటిబండ, కోయమాధారం, రామవరం ఊటగుంపు, గుళ్ళవాయి, పాతరెడ్డిగూడెం, బండలబోరు గ్రామాల్లో తాగునీటి సమస్య తీర్చాలని, పెద్దవాగు వెంబడి ఉన్న గ్రామాలు నీటమునగకుండా కరకట్ట నిర్మాణం వెంటనే చేపట్టాలన్నారు. కుక్కునూరు, దాచారం మధ్య గుండేటి వాగు బ్రిడ్జిపై పడిన గండి వెంటనే పూడ్చాలని, లంకాలపల్లి నుంచి వెంకటాపురం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు పునర్‌నిర్మించాలని కోరారు. పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, బాచినేని సత్యనారాయణ, గడ్డాల ముత్యాలరావు, మేడేపల్లి సర్పంచ్ సోడే రాంబాబు, డివిజన్ నాయకులు కట్టం వీరాస్వామి, కట్టం ముత్యాలరావు, పీఓడబ్ల్యు నాయకురాలు ఎస్కే మున్నీ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ప్రథమ చికిత్సా కేంద్రానికి మందుల అందజేత



ప్రథమ చికిత్సా కేంద్రంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కు మందులను అందజేస్తున్న దాత సాంబశివరావు

ద్వారకాతిరుమల: శ్రీవారి ప్రాణదాన ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ప్రథమ చికిత్సా కేంద్రానికి ఒక దాత 2 వేల మంది భక్తులకు సరిపడ మందులను ఉచితంగా ఆదివారం అందజేశారు. తెనాలికి చెందిన ఏవీ సాంబశివరావు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ప్రథమ చికిత్సా కేంద్రంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కు ఈ మందులను అందజేశారు. వీటిని కాలినడక భక్తులకు వినియోగించాలని దాత కోరారు. ఈ సందర్భంగా దాతను ఆలయ అధికారులు, పలువురు భక్తులు అభినందించారు.

కళ తప్పిన ఎర్రకాలువ పర్యాటకం



ఎర్రకాలువ జలాశయం వ్యూ



పర్యాటకుల కోసం నిర్మించిన రెస్టారెంట్



మూతబడిన ఎర్రకాలువ బోటింగ్ పాయింట్ టిక్కెట్ కౌంటర్ భవనం

జంగారెడ్డిగూడెం రూరల్: ఎర్రకాలువ పర్యాటకం కళ తప్పింది. జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టు పేరున్న జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం శ్రీ కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం సంవత్సరంలో 365 రోజులు జలకళను సంతరించుకుని పర్యాటకులకు ఎంతో ఆహ్లాదాన్ని కల్గిస్తుంటుంది. దీంతో సెలవు దినాలతో పాటు సాధారణ రోజుల్లో కూడా జలాశయాన్ని చూసేందుకు పర్యాటకులు వస్తుంటారు. అంతేకాకుండా కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయానికి సమీపంలో ద్వారకాతిరుమల, శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి ఆలయాలతో పాటు జంగారెడ్డిగూడెంలో శ్రీ గోకుల తిరుమల పారిజాతగిరి వెంకన్న ఆలయం, బుట్టాయగూడెం మండలం గుబ్బలమంగమ్మ, కామవరపుకోట మండలం గుంటుపల్లి బౌద్ధారామాలు ఉన్నాయి. ఈ ప్రాంతాలకు వచ్చిన భక్తులు, పర్యాటకులు ఎర్రకాలువ జలాశయానికి వస్తుంటారు. ఈ జలాశయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు 2013 సంవత్సరంలో రూ.3 కోట్ల నిధులు కేటాయించి రెస్టారెంట్ భవనాలు పూర్తి చేశారు. అలాగే 2017 జూన్ 6న బోటింగ్ షికారు కూడా ప్రారంభించారు. అయితే కొన్ని నెలలకే ఆ బోటు షికారును నిలిపివేశారు. దీంతో రానురాను ఎర్రకాలువ జలాశయం ప్రాంతం పర్యాటక కళ తప్పింది. పర్యాటక అభివృద్ధిపై సంబంధిత శాఖ ప్రత్యేక శ్రద్ధ కనబర్చకపోవడంతో ఇక్కడకు వచ్చే పర్యాటకులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. పర్యాటకుల కోసం రెస్టారెంట్ భవనం నిర్మించినప్పటికీ ఆహ్లాదాన్ని కల్గించే పనులు చేపట్టకపోవడంతో పాటు బోటు షికారు కూడా నిలిపివేయడంతో పర్యాటకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. దీంతో బోటింగ్ పాయింట్ వద్ద నిర్మించిన టిక్కెట్ కౌంటర్ నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఈ భవనం చెత్తా చెదారంతో వృథాగా మారింది. ఇప్పటికైనా పర్యాటక శాఖ దృష్టి సారించి ఎర్రకాలువ జలాశయం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.